
# మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ లక్ష్యం..



- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- మహిళా సంక్షేమ వారోత్సవాలు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
రాష్ట్రంలోని మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మక పథకాలను అమలు చేస్తోందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యాచరణలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్కే ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం మహిళా సంక్షేమ వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

?ఈ సందర్భంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు భారీగా బ్యాంక్ లింకేజీ రుణాలను పంపిణీ చేశారు. మొత్తం 337 సంఘాలకు రూ. 40 కోట్లు, ఎఫ్ పీసీ, ఎఫ్ పీజీ సీఐఎఫ్ కింద 42 సంఘాలకు రూ. కోటి ఐదు లక్షలు, శ్రీనిధి రూరల్ కింద 278 సంఘాలకు రూ. ఏడు కోట్ల 13 లక్షలు, మెప్మా బ్యాంక్ లింకేజీ కింద 55 సంఘాలకు రూ. ఆరు కోట్ల 33 లక్షలు, శ్రీనిధి మెప్మా కింద 61 సంఘాలకు రూ. కోటి 50 లక్షల విలువైన చెక్కులను ప్రజాప్రతినిధులు, అధికారులు అందజేశారు. అలాగే, ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్న సంఘాలకు రూ. 11,36,113 కమీషన్ చెక్కును అందించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, మార్చి 6న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించిన 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వం మహిళా శక్తిని బలోపేతం చేస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు రూ. 57 వేల కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు మంజూరు చేశామని, వడ్డీని కూడా ప్రభుత్వమే చెల్లిస్తోందని అన్నారు . మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని , ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో 60 శాతం బాధ్యతలను మహిళా సంఘాలకే అప్పగించామని అన్నారు . ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతులకు రెండు లక్షల రుణమాఫీ వంటి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని అన్నారు . ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రూ. ఐదు లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని, జూన్ 2 తర్వాత మరిన్ని ఇండ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

?జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా పది థీమ్ లతో వివిధ శాఖలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని అన్నారు . మహిళా సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా బాల్య వివాహాల నిర్మూలన, చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో మహిళా సంఘాల ఎన్ పీఏ తక్కువగా ఉందని అభినందిస్తూ, తీసుకున్న రుణాలను కిరాణా షాపులు, మగ్గం వర్క్ వంటి స్వయం ఉపాధి పనులకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు . పాఠశాలల మరమ్మతులు, యూనిఫాంల తయారీ బాధ్యతలను మహిళా సంఘాలకే అప్పగించడం ద్వారా వారికి ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు.కార్యక్రమంలో వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వీర్నపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు నాయక్, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున రావు. తహసీల్దార్ మహేష్ తదితరులు పాల్గొన్నారు

## అంగన్వాడీ కేంద్రాలు చిన్నారుల భవిష్యత్తుకు పునాది..

**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**
**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**
చిన్నారుల ఆరోగ్యవంతమైన ఎదుగుదల, విద్యాభివృద్ధిలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా వేములవాడ పట్టణంలోని శత్రాజుపల్లిలో నూతనంగా నిర్మించిన అంగన్వాడీ కేంద్రాన్ని ముఖ్య అతిథిగా విప్ ఆది శ్రీనివాస్ హాజరై ప్రారంభించారు. పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రజల అవసరాలను తీర్చడానికి 99 రోజుల ప్రణాళికతో ముందుకు సాగుతోందని అన్నారు.ఇందులో భాగంగా ప్రతి వారం ఒక శాఖ ఆధ్వర్యంలో గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీ వ్యవస్థ ద్వారా గర్భిణీలు, బాలింతలు మరియు చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం, ప్రాథమిక విద్య, ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని అన్నారు . స్వంత భవనాలు లేని అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని కల్పిస్తోందని అన్నారు .రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం సమూల మార్పులు చేపడుతోందని అన్నారు. దీనిలో భాగంగానే వేములవాడలో రూ.200 కోట్ల వ్యయంతో 20 ఎకరాల విస్తీర్ణంలో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్'ను నిర్మిస్తున్నామని, ఇక్కడ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారాన్ని అందిస్తామని తెలిపారు. అలాగే, విద్యార్థుల సౌకర్యార్థం కాస్మొటిక్, డైట్ చార్జీల ను పెంచామని, రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున 1500 మంది సామర్థ్యం గల 'తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను' ఏర్పాటు చేయనున్నట్లు



పేర్కొన్నారు. ఆరోగ్య రంగాన్ని మెరుగుపరచే క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఆసుపత్రుల్లో 36 వేల బెడ్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. శత్రాజుపల్లిలో నిర్మాణంలో ఉన్న ఆసుపత్రిని త్వరలోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు.రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, జగిత్యాల జిల్లా పొలాసా వ్యవసాయ క్షేత్రం తరహాలో వేములవాడ నియోజకవర్గంలోని మర్రిపల్లి గ్రామంలో 40 ఎకరాల్లో నూతన రైతు విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రం ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, కొత్త వంగడాలపై అవగాహన కల్పిస్తూ వ్యవసాయంలో మెరుగైన దిగుబడులు సాధించేలా ప్రోత్సహిస్తామని అన్నారు.

## గుండెపోటుతో కౌన్సిలర్ కాసర్ల పద్మ కన్నుమూత..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**



?రాజన్న సిరిసిల్ల జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని 27వ వార్డు కౌన్సిలర్ కాసర్ల పద్మ (60) గుండెపోటుతో అకాల మరణం చెందారు. గత మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేసి విజయం సాధించిన పద్మ, తన వార్డు ప్రజలకు సేవలందిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.?గత పది రోజుల క్రితం పద్మ అకస్మాత్తుగా అనారోగ్యానికి గురి కావడంతో, కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న క్రమంలో, తెల్లవారుజామున తీవ్రమైన గుండెపోటు రావడంతో పరిస్థితి విషమించి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు.



**కాసర్ల పద్మ పార్థివ దేహానికి ఘన నివాళులర్పించిన కేటీఆర్**
27వ వార్డు కౌన్సిలర్, బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు కాసర్ల పద్మ మరణించారనే వార్త పార్టీ వర్గాల్లో విషాదాన్ని నింపింది. ?పద్మ నివాసానికి చేరుకున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ పార్థివ దేహంపై బీఆర్ఎస్ పార్టీ జెండాను కప్పి,పార్థివ దేహానికి నివాళు లర్పించారు.కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కష్ట సమయంలో పార్టీ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య,సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి, పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షులు జిందం చక్రపాణి, తో పాటు పలువురు కౌన్సిలర్లు మరియు వివిధ రాజకీయ పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఆమె పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## పంట వ్యర్థాలకు నిప్పు పెట్టకండి..

**- సిరిసిల్ల ఎస్సై అశోక్**
**బలగం టీవీ, ఇల్లంతకుంట:**
పంట వ్యర్థాలను, గడ్డిని పొలాల్లో తగలబెట్టడం వల్ల భూసారం దెబ్బతినడమే కాకుండా, పర్యావరణానికి మరియు ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోందని, రైతులు తమ పొలాల్లో పంట వ్యర్థాలను దహనం చేయకూడదని ఎస్సై సిరిసిల్ల అశోక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఎస్సై సిరిసిల్ల అశోక్ మాట్లాడుతూ పంట వ్యర్థాలను తగలబెట్టడం వల్ల మట్టిలో ఉండే పంటకు మేలు చేసే బ్యాక్టీరియా నశించి, భూమి సారహీనంగా మారుతుందని, ఈ చర్య జీవో నెంబర్ 27కు విరుద్ధం. దీనిని అతిక్రమించి నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠినమైన చట్టరీత్యా చర్యలు తీసుకోబడతాయని అన్నారు . కేవలం భూమికి నష్టం వాటిల్లడమే కాకుండా, మంటల వల్ల ఇతర రైతుల పొలాలు, మోటర్లు, పైపులైన్లు, విద్యుత్ వైర్లు, స్టార్టర్లు కాలిపోయే ప్రమాదం ఉందని అన్నారు .

ముఖ్యంగా, ఇలాంటి నిర్లక్ష్యపు చర్యల వల్ల మనుషుల ప్రాణాలకు, జంతువులకు ముప్పు వాటిల్లితే నిందితులపై నాన్–బెయిలబుల్ క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తాళ్లపల్లి గ్రామ శివారులో తన వరి పొలంలో గడ్డికి నిప్పు పెట్టిన క్రమంలో 'ఎలుక నారాయణ' అనే రైతు మంటల్లో చిక్కుకుని మరణించడం అందరికీ తెలిసిందే అని అన్నారు . అనంతారం గ్రామ పంచాయతీ పరిధిలో జరిగిన ఇలాంటి నిర్లక్ష్యపు ఘటన వల్ల సుమారు 300 ఎకరాల పంట కాలిపోయి పదిమంది రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని అన్నారు .?పంట వ్యర్థాలను కాల్చడానికి ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ పొలాల్లో మంటలు పెట్టవద్దని రైతులను కోరారు .

# తడిసిన ధాన్యంపై రైతులు ఆందోళన చెందవద్దు..



**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

?రాజన్న సిరిసిల్ల జిల్లాలో అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసినప్పటికీ రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ గరిమ అగ్రవాల్ భరోసా ఇచ్చారు. తంగళ్ళపల్లి మండలం అంకుసాపూర్ గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ గరిమ అగ్రవాల్ క్షేత్రస్థాయిలో సందర్శించి, కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ధాన్యం నిల్వలు, బస్తాల తరలింపు, తూకం ప్రక్రియపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ

?జిల్లాలో ఈ సీజన్‌లో వరి దిగుబడి భారీగా పెరిగిందని, ఇప్పటివరకు 2 లక్షల 33 వేల 758 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, ఇది మొత్తం లక్ష్యంలో సుమారు 80 శాతం అని అన్నారు . కొనుగోళ్లు తుది దశకు చేరుకున్నాయని, డీఆర్డీఓ, సహకార, పౌర సరఫరాల, రవాణా శాఖల సమన్వయంతో ప్రక్రియను వేగవంతం చేశామని తెలిపారు. గోదాముల్లో ధాన్యం అన్ లోడింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించామని, ప్రతిరోజూ ఉదయం అన్ని శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని అన్నారు .

?అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యం విషయంలో రైతులు నష్టపోకుండా ఉండేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని, తడిసిన ధాన్యాన్ని వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించాలని పౌర సరఫరాల శాఖ అధికారిని ఆదేశించామని తెలిపారు. అపరల్ పార్క్, ఇతర గోదాములకు ధాన్యాన్ని తరలించి అన్ లోడింగ్ చేయిస్తున్నామని, హమాలీలకు అవసరమైన నీరు, ఆహార వసతులు కల్పిస్తున్నమని అన్నారు . ధాన్యం బస్తాలను త్వరితగతిన తరలించేందుకు తగినన్ని వాహనాలను సమకూర్చుకోవాలని ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి రామకృష్ణ, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ తదితర అధికారులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ విప్ ను కలిసిన మహిళా సంఘాల ప్రతినిధులు

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:**
రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ను శుక్రవారం సిరిసిల్ల నియోజకవర్గం మహిళా సంఘాల ప్రతినిధులు కలిసి తమ సమస్యలపై వినతి పత్రం అందించారు ఈ సందర్భంగా మహిళా ప్రతినిధులు మాట్లాడుతూ తాము తక్కువ వేతనంతో వివో ఏ లుగా పనిచేస్తున్నామని అన్నారు అన్ని ఉద్యోగ సంఘాలకు గుర్తింపునిచ్చి జీతాలు పెంచడం జరిగిందన్నారు తమకు కూడా గుర్తింపునిచ్చి జీతాలు పెంచాలని అన్నారు పని భారం ఎక్కువగా ఉంటుందని అయినప్పటికీ ప్రభుత్వ పథకాలన్నీ గ్రామస్థాయిలో తీసుకెళ్లేది తామేనని ఈ విషయాన్ని ప్రభుత్వం గ్రహించాలన్నారు తమ పట్ల ప్రభుత్వపరంగా సానుకూల నిర్ణయం వచ్చే విధంగా కృషి చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు విజ్ఞప్తి చేశారు కలిసిన వారిలో ఎల్లారెడ్డిపేట. ముస్తాబాద్. సిరిసిల్ల చందుర్తి కోనరావుపేట గంభీరావుపేట మండల వివో ఏ సంఘాల అధ్యక్షులు కొప్పుల రమ సుధారాణి పద్మ జోష్న. శ్రీనివాస్ ఆడపు శోభ. మంజుల ఉన్నారు వీరి వెంట ఎల్లారెడ్డిపేట మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండాటి రామ్ రెడ్డి, డైరెక్టర్ మెండ శ్రీనివాస్ యాదవ్ , మండల బిసి ప్రెసిడెంట్ అన్న వేణి రవియాదవ్, తదితరులు పాల్గొన్నారు

# వీవోఏల పోరాటానికి బీఆర్ఎస్ మద్దతు..

**-హామీలను వెంటనే అమలు చేయాలి...**
**-బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మల్యాల దేవయ్య**
**బలగం టీవీ, కోనరావుపేట:**
తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మండుటెండను సైతం లెక్కచేయకుండా దీక్షలు చేస్తున్న వీవోఏలకు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. శుక్రవారం కోనరావుపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుల ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు వీవోఏలకు సంఘీభావం తెలిపి, వారి నిరసనలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మల్యాల దేవయ్య మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో వీవోఏలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రస్తుత ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. పది రోజులుగా వీవోఏలు నిరసన తెలుపుతున్నా, ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని, వీవోఏలకు కనీస వేతనం నిర్ణయించి వారిని ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.?ప్రభుత్వం ఇప్పటికైనా మొండి వైఖరిని వీడి వీవోఏల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత ఉధృతం చేసి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ మంతెన సంతోష్, కేందే గంగాధర్, అనుపటి భూంరెడ్డి, అరె మహేందర్, మండల శ్రీను, తిక్కల నవీన్, బుట్టి వంశీ, శివ తేజతో పాటు పలువురు బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఐకెపి వివోఏల సమ్మెకు జిల్లా దివ్యాంగ సమితి సంపూర్ణ మద్దతు..



**బలగం టీవీ, తంగళ్ళపల్లి:**
తంగళ్ళపల్లి మండల కేంద్రంలో తెలంగాణలో ఐకెపి వివోఏల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మెకు శుక్రవారం జిల్లా దివ్యాంగ సమితి తన సంపూర్ణ మద్దతును ప్రకటించింది. ఈ సందర్భంగా జిల్లా దివ్యాంగ సమితి అధ్యక్షుడు దొంతినేని చంద్రరావు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఐకెపి మహిళా సంఘాల్లో ఎంతో నిబద్ధతతో పనిచేస్తున్న వివోఏలను ప్రభుత్వం వెంటనే గుర్తించాలని డిమాండ్ చేశారు. వీరిని ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించి, కనీస వేతనంగా నెలకు రూ. 20 వేలు చెల్లించాలని అన్నారు.

గత పదేళ్లుగా వివోఏలుగా నిరంతరం సేవలు అందిస్తున్న వారికి పదోన్నతులు కల్పించి, సీసీలుగా నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేవలం వేతనాలే కాకుండా, వారి ఆరోగ్య భద్రత కోసం ఆరోగ్య కార్డులు మరియు ఇన్సూరెన్స్ సౌకర్యాలను కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామని గొప్పలు చెబుతున్న ప్రభుత్వం, ఆ మహిళా సంఘాలను నడిపిస్తున్న వివోఏలకు కనీసం రూ. 20 వేల వేతనం ప్రకటించడం ద్వారా మహిళల పట్ల తమకు ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని అన్నారు . ఈ కార్యక్రమంలో జిల్లా దివ్యాంగ సమితి నాయకులు నీరటి రాజు, మామిడాల నరేష్, అయోధ్య రాజేందర్, అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## రామచంద్రపూర్‌లో ఉపాధి హామీ కూలీలకు అరటిపండ్లు, మజ్జిగ పంపిణీ..

**బలగం టీవీ,తంగళ్లపల్లి:**
తంగళ్లపల్లి మండలం రామచంద్రపూర్ గ్రామంలో ఉపాధి హామీ కూలీల ఆరోగ్యం పట్ల గ్రామ ప్రజాప్రతినిధులు మానవత్వాన్ని చాటుకున్నారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో, ఉపాధి హామీ పనుల్లో నిమగ్నమైన కూలీలకు ఉపశమనం కలిగించేందుకు అరటిపండ్లు మరియు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.?ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కూలీలు ఎండను సైతం లెక్కచేయకుండా కష్టపడుతున్నారని, వారి ఆరోగ్యాన్ని కాపాడటం తమ సామాజిక బాధ్యతని పేర్కొన్నారు. ?ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గంధం శ్రీనివాస్, ఉప సర్పంచ్ పొన్నాల నర్సింహులు, వార్డు సభ్యులు గడ్డం లహరి, గంధం లక్ష్మి, పత్యం శేఖర్, పొన్నాల అమృత, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు దాకూరి మాధవరెడ్డితో పాటు పలువురు స్థానిక నాయకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.






## అనాథగా మిగిలిన పసికందుకు దక్కిన "ప్రభుత్వ" ప్రేమ..

**-పసికందుకు 'అమ్మ'లా అండగా నిలిచిన జిల్లా యంత్రాంగం**

**-ఆదర్శిని'గా నామకరణం :..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

నిర్లక్ష్యానికి గురై అనాథగా మిగిలిపోయిన ఒక పసికందుకు, రాజన్న సిరిసిల్ల జిల్లా అధికార యంత్రాంగం తన వంతు బాధ్యతగా మాతృత్వపు వెచ్చదనాన్ని అందించింది. గత నెల 23వ తేదీన సిరిసిల్ల కొత్త బస్టాండ్‌లో ని మరుగుదొడ్డిలో అత్యంత దయనీయ స్థితిలో లభించిన నవజాత శిశువును కాపాడటమే లక్ష్యంగా, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, వైద్యులు మరియు పోలీసు సిబ్బంది సమష్టిగా కృషి చేశారు.

జిల్లా కలెక్టర్ శ్రీమతి గరిమ అగ్రవాల్ దిశానిర్దేశంలో, జిల్లా సంక్షేమ అధికారి పి. లక్ష్మీరాజం పర్యవేక్షణలో ఈ చిన్నారికి కొత్త జీవితం దక్కింది. ఐసీపీఎస్, సీహెచ్‌ఎల్ మరియు సఖి బృందాలు ఒక కుటుంబ సభ్యుల్లా నిరంతరం పాప ఆరోగ్యాన్ని పర్యవేక్షించగా, ప్రభుత్వ సివిల్ హాస్పిటల్ వైద్యులు అసాధ్యమైన రీతిలో పాపకు చికిత్స అందించారు. కేవలం 1500 గ్రాముల బరువుతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆ పాప, నేడు 2700 గ్రాముల బరువుతో పూర్తి ఆరోగ్యంగా ఉందంటే అది అధికారుల మానవతకు నిదర్శనం.

వైద్యులు పాపను డిశ్చార్జ్ చేయడంతో, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆదేశాల మేరకు పాపను కరీంనగర్ శిశు గృహకు తరలించారు. తరలింపుకు ముందు, అధికారులు పాపకు 'ఆదర్శిని' అని ముద్దుగా నామకరణం చేసి, వేడుకగా బారసాల జరిపి సాగనంపారు. పాప కోసం పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేసినప్పటికీ తల్లిదండ్రుల ఆచూకీ లభించలేదు. అయినా సరే, అనాథగా మిగిలిన ఆ పసికందుకు ప్రభుత్వమే తల్లిదండ్రులుగా అండగా ఉంటుందని, ఆమె బాధ్యతను మరింత బాధ్యతాయుతంగా చూసుకుంటామని జిల్లా సంక్షేమ అధికారి పి. లక్ష్మీరాజం స్పష్టం చేశారు.



## వివోఏ దీక్ష కు మద్దతు తెలిపిన బీఆర్ఎస్ యువ నాయకుడు లింగాల సందీప్

**బలగం టీవీ ఎల్లారెడ్డిపేట**

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గత ఐదు రోజులుగా వివోఏ లా నిరసన దీక్ష కొనసాగుతుండగా ఈరోజు దీక్షా యువ నాయకుడు లింగాల సందీప్ మరియు స్వేరో కమిటీ సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గతంలో వివోఏ లు దీక్ష చేస్తున్న సమయంలో ఇప్పుడు మంత్రి శాఖకు ఉన్నటువంటి సీతక్క మద్దతు తెలిపి తమ పార్టీ అధికారంలోకి వస్తే కనీసం మద్దతు ధరతో పాటు జీవిత బీమా ఆరోగ్య బీమా అందిస్తూ సెల్ఫ్ ఉద్యోగులుగా ప్రకటిస్తామని ప్రగాఢ్బాలు పలికిన సీతక్క మరియు కాంగ్రెస్ ప్రభుత్వం నేడు అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచిన వివో ఏ లను పట్టించుకోకపోవడం సిగ్గుచేటని ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా వివోఏ లా కనీస వేతనం 20,000 లు గా చేయాలని, ఆరోగ్య భద్రత తో పాటు ప్రమాద బీమా వర్తింపజేయాలని, రాజుక్ష్మా ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని, అర్హులైన వివో ఏ లను సీసీలుగా గుర్తించాలని, జీవో 58 ని సవరించాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా చేస్తున్నటువంటి దీక్షలోనే సమస్యను పరిష్కరించాలని లేదంటే పెద్ద ఎత్తున ధర్నాలు రాస్తారోకోలు చేస్తూ రాష్ట్రమంతట ఉద్యమాలు చేస్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల మహేష్ గౌడ్, యువజన నాయకులు పంతులూరి సన్నీ, గడ్డమీది సాయి చందు, గుర్రాల రాజశేఖర్, పెండ్యాల బాలకిషన్, కొర్రి ప్రణయ్, పాశం ప్రశాంత్, బండి హరికృష్ణ, తోకల నవీన్, బడే మనోజులు పాల్గొన్నారు



## వివోఏల నిరవధిక నిరాహార దీక్షకు బిజెపి మద్దతు తెలుపుతూ

**బలగం టీవీ, బోయినిపల్లి;**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న వివోఏల నిరవధిక నిరాహార దీక్షకు భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు ఎడపల్లి పరుశురామ్ నాయకత్వంలో శుక్రవారం రోజున సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు ఎడపల్లి పరుశురామ్ మాట్లాడుతూ: ప్రభుత్వం వెంటనే వివోఏల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి. గ్రామస్థాయిలో ప్రజలకు సేవలు అందిస్తున్న వివోఏల సమస్యలను నిర్లక్ష్యం చేయడం బాధాకరం. ఉద్యోగ భద్రత, గౌరవ వేతనం, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఈ నిరవధిక నిరాహార దీక్ష పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి. ప్రజాసేవకుల ఆవేదనను అర్థం చేసుకుని వెంటనే చర్చలు జరిపి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని భారతీయ జనతా పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నాం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహచారి, మండల ప్రధాన కార్యదర్శిలు రాజేంద్రప్రసాద్, మెరుపుల గంగాధర్ గౌడ్, మండల ఉపాధ్యక్షులు ఇల్లందుల బాలయ్య, పసికంటి వెంకటేశం, యువమోర్చా మండల అధ్యక్షులు మిరియాల శరత్, చంద్రారెడ్డి, సీనియర్ నాయకులు భూమ్ రెడ్డి, తుమ్మనపల్లి కిరణ్, బూత్ అధ్యక్షులు ముస్కు విజయేందర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, వివోఏలు పాల్గొన్నారు.



## అక్రమ రవాణా చేస్తున్న పశువులు స్వాధీనం

**'ఎంఎంసీ' సంరక్షణ కేంద్రానికి తరలింపు**

**బలగం టీవి, హైదరాబాద్**

పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసులు, మున్సిపల్ అధికారుల సహకారంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పోలీస్ స్టేషన్ పరిధుల్లో మొత్తం 172 పశువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ పశువులను 'ఎంఎంసీ' పశువుల సంరక్షణ కేంద్రానికి తరలించారు. మాదన్నపేట, నాగోల్, సంతోష్‌నగర్, వనస్థలిపురం, సరూర్‌నగర్, ఎల్‌బీనగర్, బోయిన్‌పల్లి, అబ్దుల్లాపూర్‌మెట్ తదితర ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో పలు వాహనాలను తనిఖీ చేసి అక్రమంగా తరలిస్తున్న పశువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

స్వాధీనం చేసుకున్న పశువుల్లో 13 పశువులను గోశాలలకు తరలించగా, 103 పశువులను ఫాతుల్లాగూడలోని 'ఎంఎంసీ' పశువుల సంరక్షణ కేంద్రానికి తరలించారు. ఈ 103 పశువుల్లో 3 ఆవులు, 52 ఎద్దులు, 15 గేదెలు, 33 దున్నపోతులు ఉన్నాయి. పశువుల సంరక్షణ కేంద్రానికి తరలించిన పశువులకు ఆరోగ్య పరిస్థితిని వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. ఆస్వస్థతకు గురైన వాటికి వెటర్నరీ ఆఫీసర్ సంజీవ్రెడ్డి చికిత్స అందించారు. అలాగే వాటిని సిబ్బంది సాయంతో అబ్జర్వేషన్ లో ఉంచారు. వీటికి అవసరమైన మేత, నీటి వసతిని కల్పించారు.

## పొగాకు వాడకాన్ని నివారించేందుకు చర్యలు..

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

జిల్లాలో పొగాకు వాడకం నివారించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ నెల 31వ తేదీ ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం ఎస్పీ మహేష్ బి గితేతో కలిసి నిర్వహించారు. పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వివిధ శాఖల వారు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వివరించారు.

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. పొగాకు వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించాలని పేర్కొన్నారు.జిల్లాలోని ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పొగాకు వాడకం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ బ్యానర్లు, పోస్టర్లు ఏర్పాటు చేయాలని, అవగాహన కల్పించాలని సూచించారు.స్వచ్ఛంద సంస్థలు మహిళలు, యువత, రైతులను భాగస్వామ్యం చేస్తూ పొగాకు వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించాలని ఆదేశించారుపొగాకు ఉత్పత్తుల చట్టం ప్రకారం 18 సంవత్సరాల కంటే చిన్న పిల్లలకు అమ్మడం నేరమని, ఈ చట్టాలు పకడ్బందీగా అమలయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు.కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, లేబర్ ఆఫీసర్ నజీర్ అహ్మద్, ఫుడ్ సేఫ్టీ అధికారి అనూష, ఎన్ జీ ఓ మెంబర్ భాస్కర్ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి..**

బడిబాట కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ



అగ్రవాల్ పిలుపు నిచ్చారు.

ఈ విద్యా సంవత్సరం 2026 – 27కు సంబంధించి బడి బాటపై విద్యా శాఖ, వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. బడి బాట లో భాగంగా ఈ నెల 14వ తేదీ నుంచి వచ్చే నెల జూన్ 19వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి ఉపాధ్యాయులు ఇంటింటి సర్వే చేసి బడీడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని, ఎవరైనా డ్రాప్ అవుట్ ఉంటే వారిని కూడా చేర్పించాలని పేర్కొన్నారు. జిల్లా సంక్షేమ అధికారి అంగన్వాడీ టీచర్ల సాయంతో అంగన్వాడి నుంచి ప్రతి విద్యార్థిని ప్రైమరీ స్కూల్ కు పంపాలని సూచించారు. అలాగే జిల్లా లేబర్ ఆఫీసర్ వర్క్ సైట్లలో ఎవరైనా బడి మానేసిన పిల్లలు ఉంటే వారిని బడికి పంపేలా చూడాలని సూచించారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి బడీడు పిల్లలందరినీ బడిలో చేర్పించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. విద్యార్థులకు ఉచిత యూనిఫామ్స్, నోట్ బుక్స్, టెక్స్ట్ బుక్స్, మధ్యాహ్న భోజనం ఇస్తున్నామని వెల్లడించారు. ఈ సంవత్సరం నుంచి పిల్లలకు అల్పాహారం కూడా ప్రభుత్వం ఇవ్వనున్నదని తెలిపారు.సమావేశంలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

## తాగునీటి సమస్యను జూన్ 5లోగా పరిష్కరించాలి

**- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**



**బలగం టీవి, హైదరాబాద్**

హైదరాబాద్‌లో తాగునీటి సమస్యను జూన్ 5లోగా పరిష్కరించకపోతే జలమండలి కార్యాలయాన్ని ముట్టడిస్తామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు.శుక్రవారం వెస్ట్ మారేడుపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడలేదని, ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్‌లో నీటి సమస్య తీవ్రంగా మారిందని ఆరోపించారు. నల్లాల ద్వారా నీరు అందడం లేదని ప్రజలు ఫిర్యాదు చేస్తుంటే అధికారులు నీటి కొరతను కారణంగా చూపుతున్నారని అన్నారు. ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే నీటికి రూ.4,000 నుంచి రూ.5,000 వరకు వసూలు చేస్తున్నారని, ఇది ప్రజలపై అదనపు భారం మోపుతున్నదని పేర్కొన్నారు. సరఫరా చేస్తున్న నీటి నాణ్యత కూడా సంతృప్తికరంగా లేదని విమర్శించారు.

జూన్ 5లోపు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో తాగునీటి సమస్యను పరిష్కరించకపోతే జలమండలి కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. అలాగే జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజించే నిర్ణయాన్ని కూడా ఆయన తప్పుబట్టారు. తగిన మౌలిక సదుపాయాలు, సిబ్బంది లేకుండానే ఈ ప్రక్రియ చేపట్టారని విమర్శించారు. ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం పై స్పందిస్తూ, ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన ముఖ్యమైన హక్కు అని, ఓటరు జాబితాలో తమ పేర్లు కొనసాగుతున్నాయో లేదో ప్రజలు ముందుగానే ధృవీకరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు సాంకేతిక పరిజ్ఞానం కలిగిన సిబ్బందిని నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత బీఆర్ఎస్ శ్రేణులదే

**- మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి**

**బలగం టీవీ, మద్నూర్**

తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత బీఆర్ఎస్ పార్టీ శ్రేణులపై ఉందని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఏనాటికైనా తెలంగాణకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌నే శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. మద్నూర్ మండలంలోని మైథిలి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జుక్కల్ నియోజకవర్గ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ కార్యక్రమంపై అవగాహన సదస్సు, కార్యకర్తల విస్తృతస్థాయి సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు.

తెలుగుదేశం పార్టీ మహానాడు వేదికగా తెలంగాణ గురించి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, తెలంగాణను అవమానించే విధంగా మాట్లాడిన వారిని తీవ్రంగా విమర్శించారు. ఆ వ్యాఖ్యలను ఇప్పటి వరకు సీఎం రేవంత్ రెడ్డి, బీజేపీ నాయకులు, చంద్రబాబు నాయుడు ఖండించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ కలిసి తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీలు రెండూ ప్రజలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. నాలుగు వేల ఏళ్ల చరిత్ర కలిగిన త్రిలింగ దేశమే తెలంగాణ అని పేర్కొంటూ చారిత్రక ప్రాధాన్యతను వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించిన ఆయన, రైతులు, మహిళలు, నిరుద్యోగ యువత, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతుల పంటల కొనుగోళ్లలో జాప్యం, యూరియా కొరత, యాప్ విధానం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

జుక్కల్, ఎల్లారెడ్డి ప్రాంతాల్లో పండిన జొన్న పంటను ఎలాంటి పరిమితులు లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే ప్రజా ఉద్యమాలు




చేపడతామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి ఫ్యూచర్ సిటీ, మూసీ ప్రాజెక్టుల పేరుతో భారీ అవినీతికి పాల్పడుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో వివిధ రంగాల్లో అవినీతి పెరిగిందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో రైతులకు, ప్రజలకు అందించిన సంక్షేమ కార్యక్రమాలను గ్రామస్థాయిలో ప్రజలకు వివరించి, పెద్ద ఎత్తున పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జుక్కల్ నియోజకవర్గ ఇన్‌చార్జి హన్మంత్ షిండే, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేష్ గుప్తా, జాజాల సురేందర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ ఇన్‌చార్జులు తదితరులు పాల్గొన్నారు.

## లాయర్ హత్య కేసులో నిందితుల అరెస్ట్



**బలగం టీవి, హైదరాబాద్**

నగరంలో సంచలనం రేపిన తెలంగాణ హైకోర్టు న్యాయవాది ఖాజా మొయిజుద్దీన్ హత్యకేసులో పోలీసులు ఏడుగురు నిందితులను అరెస్టు చేశారు. పథకం ప్రకారం ప్రమాదంలా కనిపించిన ఈ ఘటన వెనుక పక్కా కుట్ర ఉందని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్ తెలిపారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని ఐసీసీలో నిర్వహించిన మీడియా సమావేశంలో కేసు వివరాలను సీపీ వెల్లడించారు. ప్రధాన నిందితుడు ముజాహిద్ ఆలం ఖాన్ కుటుంబానికి, మృతుడు ఖాజా మోయిజుద్దీన్‌కు మధ్య మలక్‌పేట, లక్డీకాపూల్‌లోని వక్ఫ్ ఆస్తుల నిర్వహణ విషయంలో పాత గొడవలు ఉన్నాయి. వీరి మధ్య గత కొన్నేండ్లుగా సివిల్, క్రిమినల్, వక్ఫ్ ట్రిబ్యునల్ కేసులు నడుస్తున్నాయి. ఈ క్రమంలో ఎలాగైనా న్యాయవాది ఖాజా మొయిజుద్దీన్ అడ్డు తొలగించుకోవాలని ముజాహిద్ ఆలం ఖాన్, అతని తండ్రి మెహబూబ్ ఆలం ఖాన్ ఇద్దరు నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా తమ సన్నిహితులైన హసన్ అలీ, మునీర్, కిషన్ అలియాస్ పప్పును సంప్రదించారు. కిషన్ ఈ పని కోసం వినయ్, విక్రమ్, అభిజిత్, మనిదీప్ అనే వ్యక్తులను ఒప్పించాడు. మొత్తం 10 మంది కలిసి ఒక ముఠాగా ఏర్పడ్డారు. ఈ హత్యకు రూ. 15 లక్షల సుపారీ (కాంట్రాక్ట్) కుదుర్చుకున్నారు. పథకంలో భాగంగా హత్య కోసం స్కార్పియో వాహనం కొనుగోలు చేయడానికి ముజాహిద్ ఆలం ఖాన్ రూ. 2 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చాడు. ఈ ఏడాదీ జనవరి నుంచి నిందితులు మృతుని ఇంటి వద్ద, అతను తిరిగే ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించి, అదను కోసం ఎదురు చూశారు. ఈ హత్య ప్రమాదకరంగా కనిపించేలా ఈ నెల 23న ఉదయం మొయిజుద్దీన్ స్విమ్మింగ్‌కు వెళ్తుండగా అక్కడే మాటు వేసిన నిందితులు నెంబర్ ప్లేట్లు లేని స్కార్పియో వాహనంతో ఢీకొట్టి హత్య చేశారు. ఆ తర్వాత నిందితులు సాక్ష్యాలను చెరిపివేసేందుకు ప్రయత్నించి వివిధ ప్రాంతాలకు పరారయ్యారు.

ఇదిలావుండగా మృతుడి కుమారుడు ఎం.ఎస్. ఫర్హాన్ నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. 'మే 23న తెల్లవారుజామున 5:45 గంటల సమయంలో తన తండ్రి ఖాజా మోయిజుద్దీన్ స్విమ్మింగ్ కోసం వెళ్లేందుకు మాసబ్ ట్యాంక్‌లోని తన నివాసం బయట పార్క్ చేసిన కారు వద్దకు వెళ్లారు. అదే సమయంలో అతివేగంగా వచ్చిన ఒక అపరిచిత వాహనం ఆయనను ఉద్దేశపూర్వకంగా బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మా తండ్రి సుమారు 10 మీటర్ల దూరంలో పడిపోయి తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం అబిడ్స్‌లోని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆయన మరణించారు' అని ఫిర్యాదులు పేర్కొన్నారు. విచారణ చేపట్టిన పోలీసులు సీసీ ఫుటేజ్‌లను పరిశీలించారు. డ్రైవర్ అభిజిత్ అలియాస్ నాని వాహనం నడిపి హత్య చేసినట్టు గుర్తించారు. ముందుగా హరియాణాలోని పానిపట్‌లో కిషన్ అలియాస్ పప్పును అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు తెలిపిన ఆధారాలమేరకు పోలీసులు సికింద్రాబాద్ లోని పంచవటి లాడ్జ్, నారాయణగూడలోని మెహఫిల్ హోటల్ వద్ద ఉన్న సీసీటీవీ దృశ్యాల ఆధారంగా నిందితులను గుర్తించారు. ప్రధాన సూత్రధారి ముజాహిద్ ఆలం ఖాన్, మెహబూబ్ ఆలం ఖాన్ ను జూబ్లీహిల్స్‌లో వారి నివాసంలో అరెస్టు చేశారు. అలాగే వినయ్, విక్రమ్, అభిజిత్, మనిదీప్ లను అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.10.10 లక్షల నగదు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, హత్యకు ఉపయోగించిన స్కార్పియో వాహనాన్ని సీజ్ చేశామని సీపీ తెలిపారు. నిందితుల్లో మరికొంతమంది పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు కొనసాగుతోందని సీపీ తెలిపారు. ఈ కేసులో సమర్థవంతంగా పనిచేసిన అబిడ్స్ ఏసీపీ పి. ప్రవీణ్ కుమార్, నాంపల్లి ఇన్‌స్పెక్టర్ సి.హెచ్ సైదులు, ఎస్ఐ ఆదిల్ రియాజ్ ఖాన్ తోపాటు సిబ్బందిని సీపీ ప్రత్యేకంగా అభినందించారు.

## చల్మెడ లక్ష్మినర్సింహారావుని మర్యాదపూర్వకంగా కలిసిన బీఆర్ఎస్ నాయకులు

**బలగం టీవీ, బోయినిపల్లి;**

చల్మెడ లక్ష్మి నర్సింహారావుని రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు అక్కనపల్లి కరుణాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మల్కాపేట మాజీ సర్పంచ్ అరె మహేందర్, తిక్కల నవీన్ కోనరావుపేట మండల ఉపసర్పంచ్ ల ఫోరం ప్రధాన కార్యదర్శి, బడుగు అరుణ్ తదితరులు ఉన్నారు.



